## క్లుప్తంగా

### మోటార్ బైక్‌లకు వేలం

యర్రగొండపాలెం: వివిధ కేసుల్లో సీజ్ చేసిన రెండు మోటార్ బైక్‌లకు ఈ నెల 29వ తేదీన వేలం వేయనున్నట్లు ఎస్సై పి.చౌడయ్య గురువారం తెలిపారు. తహసీల్దార్ బాలకిషోర్ ఆధ్వర్యంలో బైక్‌లకు వేలం వేస్తున్నామని, మోటార్ బైక్‌లు కావాల్సిన వారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

### ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి

పుల్లలచెరువు: కలెక్టర్ ఆదేశాలపై గ్రామాల్లో ఆధార్ లేని విద్యార్థుల కోసం ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వసంత రావు నాయక్ సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 27వ తేదీ చౌటపాచర్ల, ముటుకుల, 28న మానేపల్లి, శతకోడు, 30వ తేదీన చాపలమడుగు, మల్లాపాలెం, 31వ తేదీన గంగవరం, నరజాముల తండాలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటిని గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

### లాయర్ దుర్గారావు మృతి



ఆస్పత్రిలో దుర్గారావు మృతదేహం

కురిచేడు (దొనకొండ): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లాయర్ ఉప్పలపాటి దుర్గారావు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో నూజెండ్ల మండలం మృత్యుంజయపురానికి చెందిన పాల వాహనం యోగిరెడ్డిపాలెం సమీపంలో రాంగ్ రూట్లో వచ్చి కురిచేడుకు చెందిన లాయర్ ఉప్పలపాటి దుర్గారావును ఢీకొట్టింది. ఆయన ద్విచక్ర వాహనం సుమారు 100 మీటర్లు ఈడ్చుకెళ్లడంతో దుర్గారావు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను తొలుత నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించటంతో గుంటూరు లలిత హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి దుర్గారావు గురువారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



రోగులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

ముండ్లమూరు (దర్శి): ముండ్లమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం పులిపాడులో మస్కులర్ డిస్ట్రోఫీతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. వ్యాధి జనటికల్ ప్రాబ్లంతో వచ్చిందని చెప్పారు. దీనికి మెడికల్ ట్రీట్‌మెంట్ లేదన్నారు. వారికి ఆర్థిక సాయం అందించే విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడతామని చెప్పారు. ముండ్లమూరు వైద్యాధికారి డాక్టర్ జాస్మిన్, సీహెచ్‌ఓ నారాయణరావు, ఏఎన్‌ఎం సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు



అలంకరణలో అయ్యప్ప మండపం

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో గురువారం మాల ధరించిన అయ్యప్పలు అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర సహస్రనామ పూజలు, మహా నైవేద్యాలు సమర్పించి మంగళ హారతులిచ్చారు. భైరవానంద స్వామి గురువు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో అయ్యప్పలు పాల్గొన్నారు. విచ్చేసిన అయ్యప్ప భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### సాయిబాబాకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక హారతులిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణంలో దాతల సాయంతో మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

# రైతు కష్టం వర్షార్పణం



కోతకు వచ్చిన వరిని వర్షంలో కోస్తున్న రైతులు



కళ్లంలో తడిచిన వరి ఓదెలు



వరిని ఇంటికి తీసుకెళ్లేందుకు ఒడ్డుకు చేర్చుతున్న రైతు

- పూర్తిగా తడిచిన వరి ఓదెలు
- కల్లాల మీదే తడిచిన ధాన్యం
- వరి రైతులకు భారీ నష్టం

ముండ్లమూరు (దర్శి):

ఆరుగాలం కష్టించి రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంట వర్షానికి తడిచిపోయింది. తడిచిన పంటను ఎలా బతికించుకోవాలనే తపనతో పొలంలో తడిచిన ఓదెలను సైతం ఒడ్డున వేసుకుని వర్షంలోనే రైతులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్ని కావు. మండలంలోని పోలవరం, పసుపుగల్లు, ఉల్లగల్లు, సాగర్ ఆయకట్టు పరిధిలో 1650 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. అందులో 500 ఎకరాలు కోతలు కోసి ధాన్యం నివాసాలకు చేర్చుకోగా సుమారు వెయ్యి ఎకరాలపైగా వరి వర్షానికి తడిచి ముద్దయింది. పొలాల్లో వరి రైతులు కోత కోసి ఓదెలు వేసి ఉన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కంకి వెళ్లిన వరి కంకులు తడిచి మొక్కలు మొలుస్తున్నాయి. ప్రస్తుతం వరి కళ్లాలు చేస్తూ రైతులు పొలం పనుల్లో మునిగి తేలుతున్నారు. వర్షానికి తడిచిన వరిని అలాగే కోసుకుని ఎలాగైనా ఇంటికి తీసుకెళ్లాలని వారు పడుతున్న అగచాట్లు అన్నీ ఇన్ని కావు. ఆరుగాలం పండించిన పంట నష్ట పోవాల్సి వస్తుందని ఊహించలేదని రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో 7.1 మి.మీ వర్షం కురిసింది. వరితో పాటు మిర్చి, పొగాకు వర్షానికి పూర్తిగా నష్టపోవాల్సి వచ్చింది. కోతకు వచ్చిన పొగాకు వర్షానికి ఆకుపై ఉన్న జిగట కారిపోయి ఆకు బరువు తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప వర్షానికి పూత రాలి ఆకు ముడత తెగుళ్ల బారిన పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. కంది పంట పూత దశలో ఉంది. వర్షానికి కంది పూత రాలి పోతోంది. పంటలు తెగుళ్ల బారిన పడి రైతులు భారీగా నష్టపోతున్నారు.

## నేటి పోరుబాటకు వైఎస్సార్ సీపీ సమాయత్తం

యర్రగొండపాలెం: కూటమి ప్రభుత్వం పెంచిన కరెంటు చార్జీలకు నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరుబాటకు సమాయత్తం అవుతోంది. కరెంటు చార్జీలు తగ్గించాలని ఆ శాఖ సబ్ డివిజనల్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపి అధికారులకు వినతి పత్రాలు ఇచ్చేందుకు నియోజకవర్గంలో ఉన్న 5 మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ సందర్భంగా స్థానిక కొలుకుల రోడ్డులో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మార్కాపురం రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం, మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీ, వినతిపత్రం అందజేసే కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆ ప్రకటనలో కోరింది.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



పాతంపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ శైలేంద్రకుమార్

పెద్దారవీడు: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ శైలేంద్రకుమార్ అన్నారు. మండలంలో పాతంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో రెవెన్యూ సదస్సు గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూమికి సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక రెవెన్యూ సిబ్బంది ద్వారా పరిష్కారిస్తామని తెలిపారు. గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల నుంచి పలు రకాల భూ సమస్యలపై 4 అర్జీలు స్వీకరించామని, వారికి రశీదులు అందజేశామని చెప్పారు. సర్పంచ్ పాలగిరి రామాంజనేయరెడ్డి, ఆర్ఐ గోపి, మండల సర్వేయర్ రామగోపాలరెడ్డి, వీఆర్వో సీహెచ్ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

# వరి కోతలు వాయిదా వేసుకోవాలి



పెద్దదోర్నాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైన వ్యవసాయాధికారులు

పుల్లలచెరువు: మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు చేసిన వరి కోతలను వాయిదా వేసుకోవాలని ఇన్‌చార్జి వ్యవసాయాధికారి ఎల్.మాల్యాద్రి కోరారు. మండలంలోని ముటుకుల, చౌటపాచర్ల, ఐటీవరం, మానేపల్లి గ్రామాల్లో సాగు చేసిన వరి పంటలను ఆయన గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్పపీడన ప్రభావం ఇంకా రెండు, మూడు రోజులు ఉండే అవకాశం ఉందని, రైతులు ఎవరూ వరి కోతలు కోయరాదన్నారు. ఒకవేళ ఎవరైనా వరి కోస్తే వరి కుప్పలను తడవకుండా పట్టలు కప్పుకోవాలని సూచించారు. ఏఈవో గోపీకృష్ణ, వీఏఏలు కొండానాయక్, వసంతరెడ్డి పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలోని సాగర్ కాలువ కింద రైతులు సాగు చేసి కోత కోసిన వరి పొలాలను మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ గురువారం పరిశీలించారు. నాలుగు రోజుల నుంచి తుఫాన్ ప్రభావానికి తడిచిన పంటలను పరిశీలించి రైతులకు సూచన, సలహాలు అందజేశారు. మండలంలోని రామాపురంలో రైతు సేవా కేంద్రంలో రైతులతో మాట్లాడి పంట బీమా పథకం గురించి వివరించారు. రైతులు నష్టపోతే బీమా వర్తిస్తుందని, ప్రభుత్వం నిర్ణయించిన నామ మాత్రపు ప్రీమియం చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. వ్యవసాయపరంగా సమస్యలు ఉంటే గ్రామాల్లో వ్యవసాయ సిబ్బందితో మాట్లాడి పరిష్కరించుకోవాలని ఏఓ తెలిపారు. సిబ్బంది ఎం.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ గురువారం మండల పరిధిలోని చింతల గిరిజన గూడెంలో పర్యటించారు. ఈ సందర్భంగా గూడెంలో క్షేత్రస్థాయి పర్యటన చేసి మిర్చి పంటలు, మిర్చి కల్లాలను పరిశీలించారు. రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు. పొలంలో నిలిచిన వర్షపు నీటిని కాలువల ద్వారా బయటకు పంపే ఏర్పాట్లు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఎకరానికి 30 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలని సూచించారు. ప్రధాన మంత్రి పసల్ బీమా పథకం పంట నమోదు గురించి రైతులకు అవగాహన కల్పించారు. పరిపూర్ణ, కరుణాకర్, ప్రసాద్, గూడేనికి చెందిన రైతులు పాల్గొన్నారు.



దొనకొండ: వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మీనారాయణ



పుల్లలచెరువు: వరిపంటను పరిశీలిస్తున్న ఏవో మాల్యాద్రి

## జాతీయస్థాయి క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను సన్మానిస్తున్న సేవా సంస్థ ప్రతినిధులు

దొనకొండ: ప్రపంచ బాక్సింగ్ డే సందర్భంగా నెట్‌బాల్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన ఎనుబరి ప్రైజీ, గతేడాది హ్యాండ్ బాల్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైన మరో విద్యార్థి చంద్రశేఖర్‌కు బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు దేవతి వరప్రసాద్, కప్పురం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో క్రీడాకారులను అభినందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ విజయానికి కారణమైన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కాలే నరసింహారావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేదలకు అవసరమైన సాయం అందిస్తామన్నారు. మారుమూల ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న నిరుపేద విద్యార్థులకు మానవతా సంస్థ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీపీఐ శత జయంతి వేడుకలు



పతాకావిష్కరణ చేస్తున్న నాయకులు

త్రిపురాంతకం: కమ్యూనిస్టు పార్టీ శత జయంతి సందర్భంగా పతాకావిష్కరణ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో గురువారం త్రిపురాంతకంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి డి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసం సీపీఐ పని చేసిందన్నారు. భూ సమస్యలను పరిష్కరించిదని పేర్కొన్నారు. అనేక పోరాటాలు చేసిందని చెప్పారు. పార్టీ నాయకులు రామయ్య, విశ్వరూప, మల్లికార్జున, శ్రీను, గాలి లక్ష్మి, నాగయ్య పాల్గొన్నారు.

## రెడ్డి సంక్షేమ సేవా సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్డి సంక్షేమ సేవా సంఘ నాయకులు

యర్రగొండపాలెం: రెడ్డి సంక్షేమ సేవా సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం స్థానిక శివాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో జరిగే సంక్షేమ కార్యక్రమాల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సేవా సంఘ నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, మార్తాల సుబ్బారెడ్డి, శనగ నారాయణరెడ్డి, పేరం నాగిరెడ్డి, బిజ్జం రమణారెడ్డి, ఆవుల రమణారెడ్డి, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, యర్ర లక్ష్మీరెడ్డి, చిట్యాల వెంగళరెడ్డి, గోపు వెంకటేశ్వరరెడ్డి, కొల్లి సత్యనారాయణరెడ్డి, ఆవుల పెద్ద చెంచురెడ్డి, పాలెం నందిరెడ్డి, కందుల నారాయణరెడ్డి, నారు నాసర్‌రెడ్డి, ఆవుల కోటిరెడ్డి, భూమిరెడ్డి చిన్న సుబ్బారెడ్డి, పేరం రమణారెడ్డి, ఏరువ శివారెడ్డి పాల్గొన్నారు.

# భూ సమస్యలు పరిష్కరించాలని మొర

- రెవెన్యూ సదస్సులో కలెక్టర్‌ను కోరిన రైతులు



తడిచిన మిర్చిని పరిశీలిస్తున్న కలెక్టర్

త్రిపురాంతకం: భూ సమస్యలు పరిష్కరించాలంటు సన్న, చిన్నకారు రైతులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు మొరపెట్టుకున్నారు. మండలంలోని ఎండూరివారిపాలెంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన కలెక్టర్‌కు రైతులు భూ ఆన్‌లైన్ చేయాలని, సరిహద్దురాళ్లు చూపి భూవివాదాలు పరిష్కరించాలని, చుక్కల భూములు సమస్యలు, భూములు సర్వేకోసం, బాగ పంపకాలు ఆన్‌లైన్ వంటి భూ సమస్యలు వివరించారు. ప్రతి సమస్య సానుకూలంగా విన్న ఆమె స్థానిక అధికారులతో చర్చించారు. సంఘంతండాకు చెందిన గిరిజన రైతులు ఆధీనంలోని భూములకు స్వాధీన పట్టాలు అందించాలని ఆ గ్రామానికి చెందిన రైతులు విన్నవించారు. వచ్చిన సమస్యలపై సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, తహసీల్దార్ శ్రీనివాసులుతో చర్చించి గడువు లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రతి అర్జీని పరిష్కరించాలన్నారు. గ్రామానికి చెందిన వారు ప్రత్యేక అవసరాలకు చెందిన వ్యక్తికి త్రిచక్ర వాహనం అందించాలని కోరారు. డయాలిసిస్ రోగులకు పెన్షన్ మంజూరు చేయాలని, సదరన్ సర్టిఫికెట్ కోసం కలెక్టర్‌ను కోరారు.

### పంటల పరిశీలన

రైతులకు సబ్సిడీపై అందించే పట్టలను సకాలంలో అందించకపోవడంతో నష్టపోయామని రైతులు కలెక్టర్ వద్ద వాపోయారు. కళ్లాల్లో తడిచిన వరి, మిర్చి, మొక్కజొన్నలను పరిశీలించిన ఆమెకు రైతులు పంట నష్టపరిహారం అందించాలని ఆదేశించారు. వరి పంట ఒక్క సారిగా కోతకు రావడంతో రైతులందరికీ పట్టలు అవసరమయ్యాయన్నారు. పట్టలు సకాలంలో అందించి ఉంటే ఉపయోగం ఉండేదన్నారు. దీనిపై ఏఓ కె నీరజను కలెక్టర్ ప్రశ్నించగా అవసరమైనన్ని పట్టలు రాలేదని, వచ్చిన వాటిని రైతులకు అందజేసినట్లు తెలిపారు. పట్టలను అందించేందుకు సంబంధిత అధికారులను తమీమ్ అన్సారియా ఆదేశించారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

### విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి



గేదెల కళేబరాలు

పొదిలి రూరల్: విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు మృతి చెందిన సంఘటన పొదిలి మండలంలోని రాజుపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రాజుపాలెం గ్రామానికి చెందిన కంచర్ల పెద్ద నాగేశ్వరరావు, కీర్తి ప్రసాద్‌కు చెందిన రెండు గేదెలను మేత కోసం పొలానికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో తుళ్లూరి రమణయ్య పొలంలో వర్షానికి తెగి పడి ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కో గేదె విలువ రూ.80 వేలకు పైగా ఉంటుందని యజమానులు తెలిపారు. అధికారులు స్పందించి నష్ట పరిహారం ఇప్పించాలని పశుపోషకులు కోరుతున్నారు.

# వీధి కుక్కల స్వైరవిహారం



రహదారి పక్కన ఉన్న వ్యర్థాల కోసం తిరుగుతున్న వీధి కుక్కలు



వీధి కుక్కల దాడిలో గాయపడిన రూతుమ్మ కాలు

తాళ్లూరు: మండలంలోని దోసకాయలపాడు, బెల్లంకొండవారిపాలెం, తూర్పు గంగవరం గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆయా గ్రామాల్లో ప్రజలు బజార్‌కు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. వ్యర్థాలను ఊరి శివారులో పడేయడంతో గ్రామ సింహాలు అక్కడికి చేరుకుని పాదచారులపై దాడి చేస్తున్నాయి. బెల్లంకొండవారిపాలేనికి చెందిన దేవరకొండ రూతుమ్మ రోజువారి పనుల కోసం పొలం వెళ్లి తిరిగి వస్తుండగా వీధి కుక్కలు ఆమెపై దాడి చేశాయి. దాడిలో రూతుమ్మ కాలికి గాయమైంది. విద్యార్థి శ్రీరాం వర్షిత్ పాఠశాలకు వెళ్తుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. బెల్లంకొండవారిపాలెం గ్రామానికి చెందిన బాలుడు డి.నిహాస్ ఆడుకుంటుండగా వెంటపడి కరిచి గాయపరిచాయి. ఈ రహదారి పలు వాహనాలతో రద్దీగా ఉంటుంది. పాదచారులు నిత్యం సంచరిస్తుంటారు. వాహనాలపై వెళ్తున్న మహిళల చీర పట్టుకోవడం, వాహనదారుల వెంట పడటం వంటి చేష్టలతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వీధికుక్కల నుంచి కాపాడాలని మండల వాసులు కోరుతున్నారు.